రైతులకు భరోసా లేక..

- పెట్టుబడికి ఇబ్బందులు
- ఖరీఫ్ పనులు మొదలైనా అందని సాయం
- గత ప్రభుత్వంలో 48,083 మందికి రైతు భరోసా లబ్ధి



ఎన్.చామవరంలో పత్తి పైరు



హంసవరం పరిధిలో ఖరీఫ్ నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

తుని రూరల్: ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతులు పెట్టుబడులకు పరుగులు తీస్తున్నారు. పెట్టుబడి సాయం చేస్తామని ఇచ్చిన ప్రభుత్వం హామీ ఎప్పుడు అమలు చేస్తుందాని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం ఇటువంటి పరిస్థితులను ముందే గుర్తించి పీఎం కిసాన్, రైతు భరోసాతో అందుకుంది. గత ఐదేళ్ల (2019–20 నుంచి 2023–24 వరకు) వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులు అందించింది. మూడు విడతల్లో ఒక్కో రైతుకు మొత్తం రూ.13,500 చొప్పున ఇతోధికంగా అందించి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే రైతు భరోసా (అన్నదాత సుఖీభవ) రూ.20 వేలు ఇస్తామని టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పెట్టుబడి సాయం ఇప్పటికీ ప్రకటించలేదు. ప్రతి సంవత్సరం ఖరీఫ్ పనులకు పెట్టుబడి సాయం వస్తున్నట్టే ఈ సంవత్సరం వస్తుందని ఆశించిన రైతు భరోసా నిధులు జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పక్క ఖరీఫ్ పనులు మొదలవడంతో పెట్టుబడికి చేబదులు, రుణాలు కోసం బ్యాంకులు చుట్టూ రైతులు తిరుగుతున్నారు. చేబదులు, అప్పులు పుట్టిన రైతులు ఖరీఫ్ పనులు కొనసాగిస్తున్నారు. కౌలు చెల్లించి, పెట్టుబడులకు మరింత కష్టమవుతుందని కౌలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతేడాది 48083 మందికి రైతు భరోసా లబ్ధి

2023–24 వ్యవసాయ సీజన్‌లో తుని మండలంలో 13025 మంది రైతులు రూ.7.33 కోట్లు, తొండంగి మండలంలో 9495 మంది రైతులు రూ.5.31 కోట్లు, కోటనందూరు మండలంలో 8744 మంది రైతులు రూ.4.92 కోట్లు, రౌతులపూడి మండలంలో 10404 మంది రైతులు రూ.5.84 కోట్లు, శంఖవరం మండలంలో 6451 మంది రైతుల 3.62 కోట్లు లబ్ధి పొందారు. ఐదు మండలాల్లో మొత్తంగా 48,083 మంది రైతులకు రూ.27.03 కోట్ల రైతు భరోసా నిధులు అందాయి. ఈ సంవత్సరం ఆయా మండలాల్లో రైతుల సంఖ్య స్వల్పంగా పెరిగి 50 వేలు చేరుకుంటుందని అధికారుల అంచన వేశారు.

సాయం సమయానికి అందితేనే మేలు



గత ప్రభుత్వంలో ఐదేళ్ల రైతు భరోసా నిధులు అందాయి. పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని ఇచ్చిన హామీపై సీఎం చంద్రబాబు నాయుడు ఎటువంటి ప్రకటన చేయలేదు. వ్యవసాయం పనులు జరుగుతున్నప్పుడే సాయం అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– గణేసుల వీరబాబు, రైతు, తేటగుంట

పీఎం కిసాన్ వెరిఫికేషన్ పూర్తి



పీఎం కిసాన్ నిధులు మంజూరుకు పది శాతం మంది లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తయింది. అన్నదాత సుఖీభవ విధి విధానాలు రావలసి ఉంది. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో బ్యాంకర్లు పంట రుణాలు, సీసీఆర్‌సీ రుణాలు మంజూరు చేస్తున్నారు.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

ఖరీఫ్ పనులు ప్రారంభం

రైతు భరోసా నిధులు ఎప్పుడు అందుతాయో తెలియని రైతులు అందినచోట అప్పులు చేసి ఖరీఫ్ వ్యవసాయ పనులు చేపట్టారు. కొంతమంది రైతులు ఇప్పటికే పత్తిసాగు చేస్తుండగా ఖరీఫ్ నాట్లు మొదలయ్యాయి. తుని మండలంలో పత్తి 290 హెక్టార్లు, వరి 65 హెక్టార్లు, తొండంగి మండలంలో పత్తి 52 హెక్టార్లు, వరి 760 హెక్టార్లు, కోటనందూరులో వరి 160 హెక్టార్లు, రౌతులపూడిలో పత్తి, 225 హెక్టార్లు, వరి 70 హెక్టార్లు, శంఖవరం మండలంలో పత్తి 20 హెక్టార్లు, వరి 145 హెక్టార్లలో వేశారు.

ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం



పాలెం, గోనేడ మధ్యలో ప్రయాణికుల కోసం ఆగిన ఆర్టీసి బస్సు

కిర్లంపూడి: ఏలేశ్వరం డిపో నుంచి మండలం పరిధి సామరాయణంపేట, పాలెం, తామరాడ, రామచంద్రపురం గ్రామాల మీదుగా కాకినాడకు నూతనంగా ఆర్టీసీ సర్వీసును గురువారం ప్రారంభించారు. ఏటిపట్టు గ్రామాలైన తామరాడ, రామచంద్రపురం, గోనేడ, పాలెం, సోమరాయణంపేట గ్రామాల ప్రజలు పట్టణాలకు చేరుకోవాలంటే ఆటోలనే ఆశ్రయించాల్సి వస్తోంది. అంతేకాకుండా గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో నూతన ఆర్టీసీ బస్సు సర్వీసుతో ప్రారంభించడంతో ఇబ్బందులు తప్పాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు: చినశంకర్లపూడి మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకంలో గురువారం విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ మిరియాల శ్రీను, పంచాయతీ మెంబర్ కర్రి శ్రీరామదుర్గ, వీఆర్వో లక్ష్మి కిట్లు అందజేశారు. కార్యక్రమంలో కస్తూరి తేజా ప్రతాప్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రాజేశ్వరి, కె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిరిపురంలో పారిశుధ్య పనులు



సిరిపురంలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం: సిరిపురంలో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. సర్పంచు పీతల నూకరాజు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పంచాయతీ సిబ్బంది రహదారులను, డ్రైన్లను శుభ్రం చేశారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆనంద్ నేతృత్వంలో పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటువ్యాధులు రాకుండా దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీఎస్ఏ ప్రసాద్, కీర్తి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం



తాగునీటి కుళాయి నుంచి వచ్చిన మురుగునీరు

ఏలేశ్వరం: అసలే వర్షాకాలం వ్యాధులు విజృంభణ ఎక్కువగా ఉంటుందని దీనికి తోడు తాగునీటి కుళాయిల నుంచి మురుగునీరు రావడంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతుంటే మురుగునీరు సరఫరా చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని తాగునీటి కుళాయిల నుంచి గురువారం మురుగునీరు రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రూపులమ్మ అమ్మవారి గుడి వద్ద ఉన్న వాటర్‌ట్యాంక్ నుంచి వచ్చే తాగునీటిలో డ్రైన్లలోని మురుగునీరు వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక మార్కెట్‌వీధి, శివాలయం వీధి పలు ప్రాంతాల్లో కుళాయిల నుంచి మురుగునీరు వచ్చింది. ట్యాంక్ నుంచి కుళాయిలకు వెళ్లే పైపులైన్లు వేసి ఏళ్లు కావడంతో అవి దెబ్బతిని డ్రైన్లల్లోని మురుగునీరు కలుషితమై కుళాయిల నుంచి వస్తోంది. దీనిపై మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు ఉచిత కంటి పరీక్షలు

కిర్లంపూడి: కిర్లంపూడిలోని శివాలయం వద్ద ఉన్న శ్రీభగవాన్ సత్యసాయి మందిరంలో ఈ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శ్రీ భగవాన్ సత్యసాయి సేవా సమితి సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం వారు వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేయనున్నారు. కంటిలో శుక్లములు ఉన్నవారికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు. అవసరమైన వారు తమ వెంట ఆధార్, రేషన్ కార్డులు, రోజూ వాడుకునే మందులు తెచ్చుకోవాలని తెలిపారు.

తలుపులమ్మను దర్శించుకున్న హోంమంత్రి అనిత

తుని రూరల్: లోవ దేవస్థానంలోని తలుపులమ్మ అమ్మవారిని హోం మంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. గురువారం దేవస్థానానికి వచ్చిన ఆమెకు వేదపండితులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలను అధికారులు అందజేశారు.

మందుల పంపిణీ



కొండవారిలోపేటలో మందులు అందజేస్తున్న సభ్యులు

శంఖవరం: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో కత్తిపూడి శివారు కొండవారి పేటలో జన వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షకాలం అంటు వ్యాధుల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా కుటుంబంలో అందిరికీ ఉపయోగపడేలా మందులు అందజేశామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనువాస్, బండి అర్జున్ పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణకు చురుగ్గా ఏర్పాట్లు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో అమ్మవారి శాకంబరి అలంకరణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఏటా ఆషాఢమాసం మాస శివరాత్రి రోజున బాలాత్రిపుర సుందరిదేవిని శాకంబరిగా అలంకరిస్తారు. ఆలయాన్ని కూడా కూరగాయలతో సుందరంగా అలంకరిస్తారని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు.

పింఛన్ల పంపిణీ



యర్రవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



జగ్గంపేట పెన్షన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ఏలేశ్వరం: యర్రవరంలో లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలోని వృద్ధులు, వితంతవులు, వికలాంగులకు ఆమె అందజేశారు, కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడిలో..

కిర్లంపూడి: మండలంలోని లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ మొదటిరోజు 95 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు గురువారం తెలిపారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కృషితో పింఛన్లు పంపిణీ సకాలంలో పూర్తిచేశామన్నారు.



ప్రత్తిపాడులో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ డేవిడ్‌రాజ్

ప్రత్తిపాడులో 94.71 శాతం..

ప్రత్తిపాడు: మండలంలో గురువారం చేపట్టిన పింఛన్లు 94.71 శాతం పూర్తయింది. మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో 11,786 మంది పింఛనుదారులుండగా సాయంత్రానికి 11,162 మందికి సచివాలయాల సిబ్బంది పింఛను సొమ్మును పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ ఎస్ డేవిడ్‌రాజ్ తెలిపారు.

గండేపల్లిలో...

గండేపల్లి: మండలంలో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. ఈ పంపిణీని ఉదయం 6.30 గంటలకే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, సర్పంచ్ బచ్చల నాగరత్నం సుధీర్, ఎంపీడీఓ, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

జగ్గంపేట: ఇల్లు లేని పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట కాపు కల్యాణ మండపం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కర్నాకుల వీరాంజనేయులు, కొండా దుర్గారావు, సతీష్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు తహసీల్దార్ బదిలీ

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ ఎస్.నరసింహారావు కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా నందిగామా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. తిరిగి కృష్ణాజిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందడంతో ఆయన విధుల నుంచి రిలీవయ్యారు. గురువారం ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) టి.శ్రీనివాసరావు బాధ్యలు స్వీకరించారు.

ముగిసిన మగ్గం వర్క్ శిక్షణ



శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

జగ్గంపేట: కాండ్రేగులలో గత కొన్ని రోజులుగా నిర్వహించిన వినయ్ సుంకర ఫౌండేషన్ మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసినట్టు ట్రస్టీ మేనేజర్ సుంకర నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తమ జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. అనంతరం 70 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వీరస్వామి, శిక్షకురాలు అల్లంపల్లి రూప, కిరణ్‌సౌమ్య, నాగమణి, కుమారి, మీనా, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



రౌతులపూడిలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మావతి



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో తల్లి పాల విశిష్టతను వివరిస్తున్న సూపరిటెండెంట్ సౌమ్య

రౌతులపూడి: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని శంఖవరం ఐసీడీఎస్ సీడీపీఓ టీడీఆర్ పద్మావతి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమన్నారు. తల్లి పాల వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పిల్లలకు ఆరునెలల పాటు తల్లిపాలు అందించాలన్నారు. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఎదుగుతారన్నారు. తల్లిపాలకు అవసరమైన మెరుగైన పౌష్టికాహారాన్ని తల్లులు తీసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ రౌతులపూడి, శంఖవరం, కత్తిపూడి సెక్టార్ల విస్తరణాధికారులు పి.జానకీలక్ష్మి, వి.వి.అరుణశ్రీ,రజని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

ప్రత్తిపాడు: పుట్టిన బిడ్డకి తల్లి పాలే శ్రేష్ఠమని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరిటెండెంట్ డాక్టర్ సౌమ్య అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సీహెచ్‌సీలో గురువారం తల్లి పాల వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాబోయే తల్లులు సమృద్ధిగా సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు బిడ్డకు సంతృప్తిగా అందుతాయన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి (సీడీపీఓ) ఆర్‌వీఎస్ లక్ష్మి మాట్లాడుతూ తల్లి పాల ఆవశ్యకతను వివరిస్తూ కాబోయే ప్రతి తల్లీ సమీపంలోని వైద్య సిబ్బందిని సంప్రదించి, వారందించే ఆరోగ్య సూచనలు పాటించాలన్నారు. గ్రామాల్లో ఈనెల 8వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలు నిర్వహించనున్నట్టు సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు, సీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ విజయోత్సవం



తునిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు



ప్రత్తిపాడులో ఎమ్మార్పీఎస్ నాయకులు విజయోత్సవం

ప్రత్తిపాడు: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో స్థానిక అంబేడ్కర్ కళామందిరం వద్ద ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు గురువారం సాయంత్రం విజయోత్సవం నిర్వహించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు, జిల్లా అధ్యక్షుడు అనంతరపు రాజు, జిల్లా ప్రతినిధులు దూలపల్లి రమణ, దేవారపు మధు, న్యాయవాది పిల్లి బలరాముడు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ అల్లూరి జంక్షన్, మార్కెట్ మీదుగా ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జడ్డా సతీష్, కాయర సారబాబు, కాతేటి మంగరాజు, జెడ్డా రాజేంద్రప్రసాద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ

తుని: ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ 30ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని ఎమ్మార్పీఎస్ ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్ అన్నారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో గురువారం తుని పట్టణంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక కొండవారిపేట, వీరవరపుపేట, ఇసుకలపేట, తారకరామనగర్, సూరవరం నుంచి ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు ర్యాలీగా వచ్చి గొల్లప్పారావు సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, మందకృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

ఆదిత్య యూనివర్సిటీ గ్లోబల్ బిజినెస్ స్కూల్‌కు అవార్డు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్లోబల్ బిజినెస్ స్కూల్‌కు ఔట్ స్టాండింగ్ బి స్కూల్ ఇన్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ అవార్డు లభించినట్టు బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి తెలిపారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన వరల్డ్ ఎడ్యుకేషన్ సమ్మిట్–2024లో ఈ అవార్డును అందుకున్నట్టు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎంటర్ ప్రెన్యూర్షిప్ స్కిల్స్‌ను పెంపొందిచడం కోసం ఏసీఐఐజీ సెంటర్‌ను 2021లో ప్రారంభించనట్టు తెలిపారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

అల్లూరి జంక్షన్‌లో కాంగ్రెస్ నిరసన



ప్రత్తిపాడు అల్లూరి జంక్షన్‌లో రోడ్డుపై కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

ప్రత్తిపాడు: స్థానిక మూడు రోడ్ల కూడలి అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో ఏర్పడిన గోతులను వెంటనే పూడ్చాలంటూ కాంగ్రెస్ కార్యకర్తలు గురువారం గోతుల వద్ద నిరసన వ్యక్తం చేశారు. చినుకు పడితే చాలు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని, వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారని తెలిపారు. ఈగోతులు పూడ్చాలంటూ పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో అల్లూరి జంక్షన్‌లో శిథిల రోడ్డుపైనే నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గాలి వెంకటరమణ, కంది మళ్ళ సామ్యేలు, ఎస్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీల ఎన్నికకు నోటిఫికేషన్



జగపతినగరం పంచాయతీ వద్ద నోటీసు అతికించిన ఉపాధ్యాయులు



పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎంఈఓ రాజబాబు

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)లకు మండల నోటిఫికేషన్ జారీ చేశారు. మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు, ఐదు ప్రాథమికోన్నత, 33 ప్రాథమిక పాఠశాలలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఈనెల 8న ఎన్నిక జరుగనుంది. దీనికి సంబంధించి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు.

ఎన్నికల నోటీసు ప్రదర్శన

కిర్లంపూడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 8న నిర్వహించే ఎస్ఎంసీ ఎన్నికల నోటీసు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గురువారం అందించారు. వాటిని స్థానిక సచివాలయాల్లోను, పంచాయతీ కార్యాలయాల్లోని నోటీస్‌బోర్డుల్లో అంతించారు. జగపతినగరం పంచాయతీ పరిధిలోని జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు నోటీసును పంచాయతీ గోడకు అతికించారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

తుని: ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. గురువారం పట్టణంలోని సీతారాంపురం అర్బన్ హెల్త్‌సెంటర్‌ను పరిశీలించారు. వైద్యుడు, సిబ్బంది, మందుల స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పరంగా అవసరమైన మందులు, సామగ్రిని సమకూరుస్తామని దివ్య చెప్పారు. అంతకు ముందు అమ్మాజీపేటలో పింఛన్లను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు కుసుమంచి శోభారాణి, ఇనుగంటి సత్యనారాయణ, యనమల రాజేష్, మోతురూరి వెంకటేష్, కమిషనర్ వెంకట్రావు పాల్గొన్నారు.



తుని అర్బన్ హెల్త్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివ్య

మొక్కలు నాటిన అధికారులు

ఏలేశ్వరం: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం అధికారులు మొక్కలు నాటారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ కె.శివప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణకు మొక్కలు దోహదం చేస్తాయన్నారు. మొక్కల పెంపకంతో పర్యవరణ కాలుష్యం అరికట్టవచ్చాన్నారు. ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు పెంచడం బాధ్యతగా తీసుకోవాలన్నారు.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ క్లబ్ సభ్యులతో కలిసి మొక్కలు నాటడం ప్రారంభించానని, వాటి సంరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నాను. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎ.చలమయ్య, ఏడీవీ ప్రసాద్, దంత వైద్యుడు ఆఫ్జల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో మొక్కలు నాటుతున్న కమిషనర్ శివప్రసాద్

సుప్రీం తీర్పు హర్షణీయం

పెద్దాపురం: మాదిగ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని వైఎస్సార్ సీపీ నాయకులు, ఉమ్మడి జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు చిందాడ ప్రకాశరావు (బాబి) అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఎస్సీ వర్గీకరణపై మాదిగలు చేస్తున్న పోరాటం సరైనదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఎంఆర్‌పీఎస్ సుదీర్ఘ పోరాటం విజయవంతమైందన్నారు. అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలల వేసి ఎస్సీ వర్గీకరణ విజయోత్సవాలు జరుపుకోవాలని బాబి పిలుపునిచ్చారు.

అమ్మవార్లకు సారె సమర్పణ

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో ఉన్న రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వరస్వామి, పదో శక్తి పీఠం అయిన పురుహూతికా అమ్మవార్లకు గురువారం విరవ గ్రామానికి చెందిన పద్మావతి శ్రీవారి సేవా సంఘం మహిళలు ఆషాడం సారెను సమర్పించారు. మహిళలంతా తమకు తోచిన పదార్థాలను గుడివద్దకు తీసుకొచ్చి ఊరేగించి, అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలందరూ ఏకరూప దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

సమర్పించిన సారె →

